ప్రజాశక్తి


గురువారం 14 ఆగస్టు 2025 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

కన్నీరు



మృతులు ముత్తుజా, మధుసూదన్, మహేష్; తోట్లవల్లూర్లో చెరువును తలపిస్తున్న వరిచేలు (కింద)

- భారీ వర్షాలు, వరదలతో బీభత్సం
- విజయవాడలో ముగ్గురు మృతి
- వేలాది ఎకరాల్లో పంటలు మునక
- ఉధృతంగా కృష్ణమ్మ ప్రవాహం
- పొంగుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- నీటిలో తేలియాడిన బెజవాడ !



కృష్ణమ్మ ఉధృతి




చెవటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు



తోట్లవల్లూరు వద్ద పడవలో వెళుతున్న







ప్రమాదాలకు కారణమైన మ్యాన్‌హోల్, చెట్టు

ప్రజాశక్తి - యంత్రాంగం (ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలు) : భారీ వర్షాలు, కృష్ణానది వరదల కారణంగా ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలు అతలాకుతలమయ్యాయి. మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. అనేక ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. రాకపోకలు నిలిచిపోయాయి. విజయవాడలో ముగ్గురు మరణించారు. మ్యాన్‌హోల్స్‌లో పడి ఇద్దరు మృతిచెందగా, రాత్రి సమయంలో కూలిన చెట్టు చీకటిలో కనిపించక దానిని ఢీకొని మరో వ్యక్తి మరణించాడు. భారీ వర్షాలతో నగరంలో డ్రైన్లు పొంగిపొర్లాయి. రోడ్లు చెరువులను తలపించాయి. రహదారులన్నీ మోకాలిలోతు నీటితో నిండిపోయాయి. చివరికి డ్రైన్లు, రోడ్లు ఏకమై నగరం నీటిలో తేలియాడుతున్నట్లు కనిపించింది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. విజయవాడ వన్‌టౌన్ 53వ డివిజన్ దూదిఫ్యాక్టరీ వద్ద మ్యాన్‌హోల్‌లో పడి మెడికల్ షాపులో పనిచేసే టిడిపి డివిజన్ అధ్యక్షులు టి.మధుసూదన్ (51) మరణించాడు. అలాగే వించిపేటకు చెందిన గోల్డ్ షాపులో పాలీష్ పని చేసే ముత్తుజా (38) అనే కార్మికుడు ఇంటికి వస్తూ డ్రైన్లో పడి మృతిచెందాడు. అలాగే లయోల కళాశాల వద్ద వర్షానికి కూలిన చెట్టును తెల్లవారుజామున ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు మహేష్ (36) అనే యువకుడు చనిపోయాడు. తెల్లవారు జామున అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న మహేష్ చీకటిలో కూలిపోయిన చెట్టు కనపడకపోవడంతో దానిని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వాసుపత్రి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వెల్లడించారు. విజయవాడకు చెందిన మృతుడు ఎలక్ట్రిక్ పని చేస్తుంటాడు. వత్సవాయి మండలం శనగపాడులో మునేటిలో దిగిన ఎక్కిరాల రాజు అనే వ్యక్తిని రెవెన్యూ సిబ్బంది రక్షించారు. భారీ వర్షాలతో బుడమేరు (మిగతా 2లో)

ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో వర్షపాతం

కృష్ణాజిల్లా మంగళవారం 8.30 నుంచి బుధవారం 8.30 గంటల వరకు సగటున 83.4 మిమీవర్షపాతం నమోదైంది. మొత్తం జిల్లాలో 2,169.2 మిమీ వర్షం కురిసింది. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలో బుధవారం ఉదయం 8.30 గంటలకు సగటు వర్షపాతం 58.96 నమోదైంది. మొత్తం 1179 మిమీ వర్షం కురిసింది. ఉదయం 8.30 నుండి రాత్రి 10 గంటల వరకు సగటు వర్షపాతం 54.62 మీమీగాను, మొతం వర్షపాతం 1092.3 మీమీగాను నమోదైంది.

బ్యారేజీకి మొదటి ప్రమాద హెచ్చరిక

3.97 లక్షల క్యూసెక్కుల వరద

తెలుగు రాష్ట్రాల్లో భారీగా వర్షాలుకురుస్తున్నాయి. దీంతో కష్ణా నదికి వరద ఉద్ధతి పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రకాశం బ్యారేజీకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ఇరిగేషన్ అధికారులు ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ నుంచి వస్తోన్న వరద దష్ట్యా అధికారులు బ్యారేజీ 70 గేట్లు పూర్తిగా ఎత్తి 3 లక్షల 97 వేల 250 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలారు. వరద ప్రవాహం అధికంగా ఉన్న నేపథ్యంలో కష్ణా పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

39 పునరావాస కేంద్రాలు ఏర్పాటు

విజయవాడలో మొత్తం 39 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో సర్కిల్ - 1లో 13, సర్కిల్ - 2లో 19, సర్కిల్ - 3లో 7 కేంద్రాలను విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు.



స్వాతంత్ర్యోద్యమ శంఖారావం

వార్త 8లో



ముంపు నివారణలో ప్రభుత్వం విఫలం

వార్త 6లో

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు

అభివృద్ధి ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి

ఎన్‌టిఆర్ జిల్లా డిఆర్‌సిలో మంత్రి సత్యకుమార్

జిల్లా జిడిపి లక్ష్యం రూ.1,12,057 కోట్లు



ప్రజాశక్తి - విజయవాడ : నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికలపై అధికారులు ప్రత్యేక దష్టిపెట్టాలని, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అన్ని రంగాల్లోనూ వద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు కషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలోని రైతు శిక్షణా కేంద్రంలో ఎన్‌టిఆర్ జిల్లా మూడో సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం మంత్రి సత్యకుమార్ అధ్యక్షతన జరిగింది. తొలుత కలెక్టర్ లక్ష్మీశ.. సుపరిపాలనలో తొలి అడుగు పనుల్లో ప్రగతిని వివరించారు. మొత్తం రూ.167.37 కోట్లతో శంకుస్థాపన చేసిన 1,661 పనుల్లో ఇప్పటికే 1,339 పనుల ప్రారంభోత్సవాలు పూర్తిచేసుకున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాకు సంబంధించి 18.5 శాతం వార్షిక వద్ధి లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను, రంగాల వారీగా జీవీఏ, జీడీడీపీ, తలసరి ఆదాయ లక్ష్యాలను వివరించారు. ఈసందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ డీఆర్‌సీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. 2024-25లో జిల్లా జీడీపీ రూ.94,561 కోట్లు కాగా, దీన్ని 2025-26లో రూ.1,12,057 కోట్లకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే 2024-25లో తలసరి ఆదాయం రూ.3,53,150 కాగా, దీన్ని 2028-29 నాటికి రూ.6,38,946లకు (మిగతా 2లో)

ఎన్‌టిఆర్ జిల్లాలో బుధవారం ఉదయం 6 గంటలకు, 8.30 గంటలకు, 8.30 నుండి రాత్రి 10 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు

మండలం పేరు	ఉదయం 6	ఉదయం 8.30	ఉదయం 8.30 రాత్రి 10 వరకు
ఇబ్రహీంపట్నం	142.8	134.2	60.3
కంచికచర్ల	9.5	110.2	0.5
జగ్గయ్యపేట	59.7	107.6	75.0
వీరులపాడు	23.1	98.2	82.0
విజయవాడ నార్త్	87.2	95.8	42.4
విజయవాడ సెంట్రల్	84.0	95.4	40.6
విజయవాడ వెస్ట్	84.0	95.4	40.6
విజయవాడ ఈస్ట్	90.0	95.2	41.8
చందర్లపాడు	87.0	71.4	58.25
విస్సన్నపేట	40.0	55.2	0.0
ఎ.కొండూరు	57.8	48.4	62.0
రెడ్డిగూడెం	35.5	37.8	56.8
మైలవరం	23.5	32.0	45.0
విజయవాడ రూరల్	81.0	29.6	65.0
నందిగామ	28.4	24.6	38.6
జి.కొండూరు	28.5	24.6	38.6
వత్సవాయి	23.5	14.8	94.5
పెనుగంచిప్రోలు	12.1	8.6	107.6
తిరువూరు	3.9	0.2	27.1
గంపలగూడెం	0.8	0.0.	1.25
జిల్లాలో మొత్తం	1002.08	1179.2	1092.3
జిల్లా సగటు	50.10	58.96	54.615

కృష్ణాజిల్లాలో వర్షపాతం

మంగళవారం 8.30 నుంచి బుధవారం 8.30 గంటల వరకు గడిచిన 24 గంటల్లో సగటున 83.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చల్లపల్లిలో 177.2, అత్యల్పంగా బాపులపాడులో 0.4 మిమీ నమోదైంది.

నాగాయలంక	143.8
అవనిగడ్డ	137.2
కోడూరు	126.8
కంకిపాడు	125.4
పామర్రు	120.4
గుడివాడ	114.4
మోపిదేవి	108.2
ఉయ్యూరు	106.2
గుడ్లవల్లేరు	105.8
పమిడిముక్కల	102.6
నందివాడ	96.4
బంటుమిల్లి	87.2
పెనమలూరు	84.6
ఘంటసాల	83.2
తోట్లవల్లూరు	74.6
ఉంగుటూరు	65.6
పెదపారుపూడి	58.2
మొవ్వ	55.4
గన్నవరం	45.2
పెడన	40.0
మచిలీపట్నం	32.6
గూడూరు	28.8
కృత్తివెన్ను	16.4

కన్నీరు

నీటి ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాలలో కొన్ని ఇళ్లు నీట మునిగాయి. గుణదల వంతెనపై నీరు ప్రవహిస్తోంది. వరద ముంపు లేకపోయినా, సరైన సమాచారం అధికార యంత్రాంగం ఇవ్వకపోవడంతో ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. కృష్ణానది వరద ఉధృతి కారణంగా ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువన లంక గ్రామాలను అధికారులు అప్రమత్తం చేశారు. జగ్గయ్యపేట, నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, విజయవాడ, పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక తదితర నదీతీర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణాజిల్లా అవనగడ్డలో, తోట్లవల్లూరు, చల్లపల్లి, కోడూరు, నాగాయలంక మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో పెసర, మినుము, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన పెసర, మినుము మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలంపల్లి డామ్ వద్ద మునేరు ఆయకట్టు పరిధిలో సుమారు 16 వేల ఎకరాల్లో పత్తి, మిర్చి, అపరాల పంటలు ముంపునకు గురయ్యాయి. వర్షపు నీటిలో నానుతున్నాయి. వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అవనిగడ్డ ఆర్‌టిసి డిపో వర్షం నీటితో నిండిపోవడంతో బస్సులు బయటకు రావడం కష్టమైంది. తోట్లవల్లూరు వద్ద కష్ణానది ఉదతంగా ప్రవహిస్తుండడంతో లంక గ్రామాల ప్రజలు నాటుపడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. నిత్యావసర సరుకులు కూడా వీటిపైనే తీసుకెళుతున్నారు.

పొంగుతున్న వాగులు

ఎన్‌టిఆర్ జిల్లాలో పలు వాగులు పొంగుతున్నాయి. కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు రోడ్డుపై ఐదు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది.

వివిధ ప్రాజెక్టు వద్ద బుధవారం రాత్రి నమోదైన ఇన్‌ఫ్లో	
శ్రీశైలం	1,89,651
నాగార్జున సాగర్	2,54,784
పులిచింతల	3,45,289
మునేరు (కీసర)	0,24,649
ప్రకాశం బ్యారేజి	3,97,250
బుడమేరు	0,00,000

అభివృద్ధి ప్రణాళికలపై దృష్టి

చేర్చాల్సి ఉందన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాల్లో జీవీఏ వద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు సమష్టి కషి అవసరమని మంత్రి పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ విజయవాడ అర్బన్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు డ్వాక్రా బజార్ల ఏర్పాటు, ఎర్రకట్ట పైవంతెన ఆధునికీకరణ, స్టామ్ వాటర్ డ్రెయిన్ పనుల డీపీఆర్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలో ఫుడ్ కోర్టుల ఏర్పాటు, మూడు కాల్వల గట్ల సుందరీకరణతోపాటు గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనలు, గ్రేటర్ విజయవాడ ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో పలువురు శాసనసభ్యులు ఆయా నియోజకవర్గాలకు సంబంధించి వివిధ అంశాలను ప్రస్తావించారు. పీఎం సూర్యఘర్ పథకం అమలు, గహ నిర్మాణాల వేగవంతానికి రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల ఏర్పాటు, అడ్డంకుల్లేని సురక్షిత తాగునీటి పథకాల పటిష్ట అమలు, ఆర్అండ్ బీ రహదారుల మరమ్మతులు, గన్నవరం – విజయవాడ రహదారి, లింకు రోడ్ల అభివద్ధి, విజయవాడ అర్బన్ పరిధిలో కొండ ప్రాంతాలకు రెయిలింగ్, ఆటోనగర్ల అభివద్ధి, సౌకర్యాల కల్పన, వివిధ ప్రాజెక్టుల డీపీఆర్‌ల రూపకల్పన, వేదాద్రి–కంచల ఎత్తిపోతల పథకాలు తదితరాలపై చర్చించారు. ఎ.కొండూరుకు కష్ణా జలాల సరఫరాకు సంబంధించి ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయినందున, పైపులైన్ల పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. ఎ.కొండూరు డయాలసిస్ కేంద్రంలో వారానికి ఒకసారి కాకుండా రెండు రోజులు నెఫ్రాలజిస్టు సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎలు యార్లగడ్డ వెంకట్రావు, వసంత వెంకట కష్ణ ప్రసాద్, తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, జడ్‌పి సిఇఒ కె.కన్నమనాయుడు, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, నందిగామ, తిరువూరు ఆర్‌డిఒలు కె.బాలకష్ణ, కె.మాధురి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

బందరులో క్విట్ కార్పొరేట్



ప్రజాశక్తి మచిలీపట్నంఅర్బన్ : వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల ప్రవేశాన్ని అడ్డుకోవాలని వ్యవసాయ, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు బుధవారం మచిలీ పట్నం కోనేరు సెంటర్లో ధర్నా నిర్వహించారు. వ్యవసారంగంలో ఇప్పటికే చిన్న కమతాల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 20 సెంట్లు భూమి కలిగిన చిన్న పేద బిక్కి రైతులకు అన్నదాత భరోసా పథకం వర్తించడం లేదని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు పంచకర్ల రంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తులపై రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కాపాడాలన్నారు. కష్ణాజిల్లా రైతు సంఘం అధ్యక్షులు కోసూరు శివ నాగేంద్ర మాట్లాడుతూ అధిక వర్షాల బారిన పడి ముంపుకు గురైన వరి రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, మచిలీపట్నం సిపిఎం నగర కమిటీ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం సిఐటీయూ నగర కన్వీనర్ చిరువోలు జయరావు, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎండీ యోనస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్రంలో అత్యుత్తమ ఎక్సైజ్ పాలసీ : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : దేశంలోనే అత్యుత్తమ ఎక్సైజ్ పాలసీ ఏపీలో అమలు చేశామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం మచిలీపట్నంలో పాత్రికే యులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా మద్యం పాలసీని అమలు చేశామని, రాష్ట్రంలో అమలైన పాలసీతో పొరుగు రాష్ట్రాల్లో మద్యం ఆదాయం తగ్గిపోయిందన్నారు. మరోవైపు పొరుగు రాష్ట్రాల నుండి మద్యం అక్రమ రవాణా, నాటు సారా తయారీని నిర్మూలించామని ఫలితంగా రాష్ట్ర ఆదాయం పెరిగిందన్నారు. పర్మిట్ రూం కోసం రూ.65 లక్షల లోపు లైసెన్సు ఫీజు ఉన్న మద్యం షాపులకు రూ.5 లక్షలు, ఆ పైన లైసెన్సు ఫీజు కలిగిన షాపులకు రూ.7.50 లక్షల చొప్పున ఫీజు వసూలు చేయబోతున్నామన్నారు. అలాగే బార్ పాలసీని వచ్చే నెల నుండి అమలు చేయబోతున్నామని, దేశంలోని వివిధ రాష్ట్రాలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పాలసీని పరిశీలిస్తున్నాయన్నారు. మద్యం షాపుల గురించి వైసీపీ నేతలు మాట్లాడే అర్హత కోల్పోయారని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వైసిపి నాయకులు గతంలో వ్యవహరించారని, కానీ నేడు ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతున్న పోలింగ్ చూసి ఓర్వలేక కుట్రలకు తెరలేపారన్నారు.

నవరాత్రి ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటించాలి : ఎస్పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకునే నిర్వాహకులు, ప్రజలకు, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పి ఆర్.గంగాధర రావు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీలు, యువత ముందస్తు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని భద్రత పరమైన చర్యల దష్ట్యా పోలీసు శాఖ సూచించే నియమ నిభందనలు పాటించాలని సూచించారు. మట్టి గణపతి ప్రతిమను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా ఉండాలన్నారు. పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, అధిక శబ్దాలతో కూడిన డీజే బాక్సులు వినియయోగించడం వంటివి చేయరాదని, ప్రజలకు ఇబ్బంది కలిగేలా బాణసంచా కాల్చ వద్దని సూచించారు. మండపాల ఏర్పాటుకు ముందస్తుగా అన్ని శాఖల నుండి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. మతసామరస్యాలకు ప్రతీకగా గణేష్ ఉత్సవాలు ఉండాలని అన్నారు.

రైతులకు ఎరువులు అందించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా,పొటాష్ సరఫరా చేయాలని రైతు,కౌలు రైతు సంఘాల నాయకులు బుధవారం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభించి నెల దాటిందని ఈ సమయంలో పంట దుబ్బు వేసుకునే సమయం అని ప్రస్తుతం ఇప్పుడు రైతులకు యూరియా,పొటాష్ చాలా అవసరమని కానీ అధికారులు సరిపడ యూరియా అందించలేక పోవడంతో రైతులు, కౌలు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులందరికీ యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన రైతు,కౌలు రైతు సంఘాల నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరావు, పంచకర్ల.రంగారావు,శివ నాగేంద్రరావు, నారాయణరావు,లు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో అన్ని ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో 25 శాతం సీట్లు పేద, బలహీన వర్గాల పిల్లల కోసం కేటాయించామని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో అర్డినేటర్ కుముదిని సింగ్ తెలిపారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ కు ఇది కొనసాగింపు అన్నారు. ఇంకా ఖాళీగా ఉన్న సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారన్నారు. కాబట్టి ఈ సీట్లలో అడ్మిషన్ల కోసం ఈ నెల 12 నుండి 20 తేదీ లోగా తల్లిదండ్రులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ నెల 21 నాటికి విద్యార్థుల అర్హత నిర్ధారణ చేస్తామని, ఆగస్టు 25 న లాటరీ పద్దతి ద్వారా ఫలితాల ప్రకటిస్తామన్నారు. 31 ఆగస్టు నాటికి పాఠశాలల్లో అడ్మిషన్లు ఖరారు చేస్తామనన్నారు. దరఖాస్తు విధానం గురించి పూర్తి సమాచారం http://cse.ap.gov.in వెబ్‌సైట్ లో ఉంటుందన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

రైతులకు మెరుగైన సేవలందిస్తాం

ప్రజాశక్తి-చల్లపల్లి : రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని కొత్త మాజేరు పిఎసిఎస్ చైర్పర్సన్ తిరుమల శెట్టి బాల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మాజేరు పి ఎస్ సి ఎస్ లో పర్సన్లు తిరుమల శెట్టి నాగరాజు శేఖర్, యార్లగడ్డ శ్రీరామచంద్రమూర్తిలతో కలిసి బాధ్యతలు చేపట్టారు. చైర్ పర్సన్ గా బాధ్యతలు అప్పజెప్పిన అవనిగడ్డ శాసనసభ్యులు బుద్ధ ప్రసాద్, కూటమి నేతలకు కు కతజ్ఞతలు తెలిపారు. రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా, అందరినీ కలుపుకుని పారదర్శకంగా సేవలు కొనసాగు సేవలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చక్రపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరంను ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలి : యార్లగడ్డ


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

ప్రజాశక్తి-గన్నవరం : విజయవాడకు సమీపంలో ఉన్న గన్నవరంను కష్ణాజిల్లా నుంచి వేరుచేసి ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడ ఇరిగేషన్ కాంపౌండ్ లోని రైతు శిక్షణ కేంద్రంలో జరిగిన జిల్లా సమీక్ష మండలి సమావేశానికి హాజరైన ఇన్చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ జిల్లాల పునర్విభజన పేర్లు, సరిహద్దుల మార్పు కోసం ఏర్పాటు చేసిన శాసనసభ ఉప కమిటీ లో సభ్యులుగా ఉన్నందున ఈమేరకు సత్యకుమార్ కు యార్లగడ్డ వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన జరిగిన సమయంలో భౌగోళికంగా విజయవాడ ను ఆనుకొని ఉన్న గన్నవరం మండలాన్ని మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణాజిల్లాలో కలపటం వల్ల జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలకి ఇబ్బందికరంగా మారిందన్నారు. జిల్లాల పునర్విభజనలో జరిగిన పొరపాట్లను సరిదిద్దేందుకు ప్రభుత్వం పూనుకున్నందున, విజయవాడ పేరుతో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న గన్నవరం మండలాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని, ఉంగుటూరు, బాపులపాడు మండలాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని ఆయన కోరారు. అదేవిధంగా విజయవాడలో ఉన్న విజయవాడ రూరల్ మండలాన్ని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం చేయాలని సూచించారు. ఎన్టీఆర్ పుట్టిన నిమ్మకూరు కృష్ణాజిల్లాలో ఉందని కానీ విజయవాడకు ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ జిల్లా గాను ఎన్టీఆర్ జిల్లాను కృష్ణాజిల్లా గాను ఈ పేర్లు మార్పు చేయాలని యార్లగడ్డ ప్రభుత్వాన్ని కోరారు.

పోలీసుల అదుపులో ఇద్దరు బాలనేరస్తులు

- రూ. 4.30 లక్షల బైకులు స్వాధీనం



ప్రజాశక్తి-గన్నవరం : హైదరాబాద్ జువెనైల్ హోమ్ నుండి గత నెల 22వ తేది రాత్రి పారిపోయిన ఐదుగురు బాల నేరస్తులలో ఇద్దరిని బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు గన్నవరం సర్కిల్ పోలీస్ స్టేషన్ లోని క్రైమ్ పోలీసులు తెలిపారు. కేసు వివరాల్లోనికి వెళితే.. ఈ నెల 22 వ తేది రాత్రి జువెనైల్ హోమ్ నుండి పారిపోతూ హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైకు బజాజ్ పల్సర్ -125 ను దొంగతనం చేసుకుని వస్తూ చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరొక బైకు బజాజ్ 160 దొంగతనం చేసుకుని వచ్చి విజయవాడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో ఉంటూ చిన్న చిన్న దొంగతనాలు చేశారు. బుధవారం ఉదయం గన్నవరం వస్తూ పోలీసులను చూసి వారు భయపడి పారిపోతుండగా గన్నవరం ఎస్సై శ్రీధర్, సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా జువెనైల్ హోమ్ నుండి పారిపోయి వచ్చామని, బైక్‌లు కూడా దొంగతనం చేశామని చెప్పారు. దొంగిలించిన బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి విలువ సుమారు 4.30 లక్షలు ఉంటుందని తెలిపారు.

సోమనాథ్ ఛటర్జీకి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పామర్రు : లోక్‌సభ మాజీ స్పీకర్, అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత కామ్రేడ్ సోమనాథ్ ఛటర్జీ 7వ వర్ధంతి సందర్భంగా ఆయనకు పామర్రులో ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక పుట్లమ్మ సత్రం భవనం మీద జరిగిన కార్యక్రమంలో సోమనాథ్ ఛటర్జీ చిత్రం పటానికి సిపియం సీనియర్ నాయకులు కాటూరి నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవన నిర్మాణ సంఘం జిల్లా కోశాధికారి వేము పెదబాబు, సిపియం పామర్రు మండలం మాజీ కార్యదర్శి దునుకు రఘునాధరావు, చిరికి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంటల పరిరక్షణకు చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారీ వర్షాలకు దెబ్బతింటున్న పంట పొలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ డ్రైనేజీ అధికారులు నీటి సంఘాల అధ్యక్షులకు సూచించారు. వీరంతా ముంపు ఉన్న ప్రాంతాల్లో పర్యటించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మంగళవారం రాత్రి నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షం నేపథ్యంలో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామాల్లో నిలిచి ఉన్న నీటిని తొలగించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని బుద్ధ ప్రసాద్ ఆదేశించారు.

ఆలయానికి వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-పామర్రు : స్థానిక శివాలయం వద్ద నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయం కు ముప్పిడి కుటుంబ సభ్యులు వెండి కిరీటం,కర్ణ ఆభరణాలు వితరణగా అందించారు. ఈ మేరకు బిన్నీ షాప్ యజమాని ముప్పిడి బాబు,పార్థసారథిలు గురు స్వాములకు ఆభరణాలను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి సాంబయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.





వణికిస్తున్న వర్షం

- విజయవాడలో ముగ్గురు మృతి
- పొంగుతున్న వాగులు, వంకలు
- తుడిచిపెట్టుకుపోయిన తొలకరి పంటలు
- అత్యధికంగా రెడ్డిగూడెంలో 71.5 మి.మీ వర్షం

ఎన్‌టిఆర్ జిల్లాను భారీ వర్షం వణికించింది. విజయవాడలో మ్యాన్‌హోల్స్‌లో పడి ఇద్దరు, చెట్టుకు ఢీకొని ఒకరు మృతిచెందారు. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీళ్లు చేరాయి. వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరదతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షానికి పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయవాడ: విఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను 24 గంటలు అందుబాటులో ఉంచుతున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బుధవారం సితార సెంటర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లేబర్ కాలనీలో నివసిస్తున్న ప్రజల ఇంట్లోకి నీరు రావడం గమనించి, వారికి వెంటనే ఇంటి వద్దనే ఆహారం అందించేటట్టు ఏర్పాటు చేయాలని, పునరావస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరదలకు సంబంధించి ప్రజలు ఎటువంటి సాయం కావాలన్నా, ఫిర్యాదులు ఉన్నా 8181960909 నంబర్కు వాట్సప్ ద్వారా తెలుపవచ్చని, 0866-2427485, 0866-2424172, 0866 2427485, నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు.



ఇబ్రహీంపట్నం జూపూడి వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు



జగ్గయ్యపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు



కంచికచర్ల కీసర బ్రిడ్జి వద్ద మునేరు



నందిగామ మండలం దాములూరు వంతెన వద్ద



ప్రజాశక్తి-విజయవాడ, అర్బన్, సిటీ

మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి విజయవాడ నగరంలోని డ్రెయిన్లు, వీధులు, రహదారులు ఏకమయ్యాయి. వన్‌టౌన్ 53వ డివిజన్ దూది ఫ్యాక్టరీ వద్ద తెరిచి ఉంచిన ఐదారు అడుగుల లోతులో ఉన్న మ్యాన్‌హోల్లో పడి మెడికల్ షాపులో పని చేసే టిడిపి డివిజన్ అధ్యక్షులు మధుసూదన్ (46) మృతిచెందాడు. వించిపేటకు చెందిన గోల్డ్ షాపులో పాలీష్ పని చేసే ముత్తుజా (40) ఇంటికి వస్తూ దళవారి సుబ్రహ్మణ్యం మునిసిపల్ స్కూల్ వద్ద డ్రెయిన్‌లో పడి మృతిచెందాడు. లయోల కళాశాల వద్ద వర్షానికి కూలిన చెట్టును ఢీకొని ఎలక్ట్రిక్ పని చేసే మహేష్ (36) మృతిచెందాడు. మూడు కుటుంబాలు కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి దుఃఖ:సాగరంలో మునిగిపోయాయి. సింగ్‌నగర్ 62వ డివిజన్ పటేల్ నగర్‌లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. మోటార్ల ద్వారానే ఆ నీటికి బయటకు పంపించే మార్గం ఉన్నా...ఆ దిశగా విఎంసి అధికారులు చర్యలు తీసుకోలేదు. 64వ డివిజన్ కండ్రికలోని సుబ్బారెడ్డి మునిసిపల్ స్కూల్ ఎదురుగా ఉన్న నాలుగైదు లైన్లలో కూడా ఇళ్లలోకి నీరు చేరింది. కృష్ణలంకలోని రాణిగారితోట, భ్రమరాంబపురం, రామలింగేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పల్లపు ప్రాంతాలు బురద నీటితో శానిటేషన్ అధ్వానంగా తయారైంది. **కంచికచర్ల:** కంచికచర్లలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చుట్టుపక్కల గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి.. ఈదురు గాలులకు చెట్లు పడిపోయాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో తొలకరి పంటగా సాగు చేసిన పెసర, మినుము, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కంచికచర్ల మండలంలో ఈ ఏడాది పెసర 2006 ఎకరాలు, మినుము 500 ఎకరాలు, మొక్కజొన్న 500 ఎకరాల్లో సాగు చేశారు. ముసురు పట్టడంతో కోతకు వచ్చిన పెసర, మినుము మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగులకు భారీగా వరద చేరింది. చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు పొంగి రోడ్డుపై ఐదడుగుల మేర ప్రవహిస్తోంది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం నుండి వచ్చే ఏనుగు గడ్డ వాగుకు భారీగా వరద చేరింది. వైరా, కట్టలేరు, మున్నేరుకు వరద ఉధృతి పెరిగింది. కీసర బ్రిడ్జి వద్ద బుధవారం సాయంత్రం వరద 3.3 మీటర్లు ప్రవహించింది. **నందిగామ:** నందిగామ మునేటికి భారీగా వరద వచ్చింది. నందిగామ మండలం దాములూరు వద్ద వైరా, కట్టలేరు, మునేరు పొంగి ప్రవహించటంతో కట్టలేరుకు భారీగా వరద చేరింది. కట్టలేరు వంతెనపై వరద పొంగి ప్రవహించటంతో నందిగామ, వీరులపాడు మండలాలతో పాటు ఎన్టీఆర్ జిల్లా, ఖమ్మం జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలంపల్లి డామ్ వద్ద మునేటి వరద పొంగి ప్రవహించటంతో పోలంపల్లి మునేరు ఆయకట్టు పరిధిలో సుమారు 16 వేల ఎకరాలు వరకు వరద ముంపునకు గురవుతున్నాయి. పత్తి, మిర్చి, అపరాలు, మాగాణి పంటలు నీట మునిగాయి. నందిగామ, చందర్లపాడు మండలాలలో అడవిరావులపాడు, చందాపురం, శనగపాడు, అనాసాగరం వద్ద నల్లవాగు, కూచివాగు పరవళ్లు తొక్కుతున్నాయి. **వత్సవాయి :** మండలంలోని శనగపాడు గ్రామంలో మునేటిలో దిగి స్నానం చేయాలనుకున్న ఎక్కిరాల రాజు వరదలో చిక్కుకుపోయాడు. ఎస్సై అర్జున్, తాసిల్దార్ శాంతిలక్ష్మి వెంటనే స్పందించి అతన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పోలంపల్లి మునేరు చెక్ డ్యాం నుండి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా పాకాల చెరువు దగ్గర్నుంచి వస్తున్న వరద రాజోలు మీదుగా ఖమ్మం జిల్లాలో ప్రవహిస్తూ వరద నీరు పోలంపల్లి రాజీవ్ మునేర్ చెక్ డ్యామ్‌కు చేరుకుంటుంది. **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం గాజులు పేటలో ఇళ్లల్లోకి నీరు చేరింది. ఖాజీమాన్యంలో ఇళ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. వరదనీరు కీలేశపురం వద్ద జాతీయ రహదారి పైకి చేరాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఫైజునిసా, కుమారి శివమ్మ, విఠల్‌రావు, మహేష్ పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగం వద్ద వరద నీటిని ఎప్పటికప్పుడు తహశీల్దార్ వెంకటేశ్వర్లు పరిశీలిస్తున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 13 నుంచి 20 వరకు కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. **జగ్గయ్యపేట:** వర్షాలకు పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. నదీ పరివాహక ప్రాంతాలైన ముక్త్యాల, వేదాద్రి, జయంతిపురం, రావిరాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. **వీరులపాడు:** రంగాపురం జుజ్జూరు గూడెం మాధవరం పెద్దాపురం చౌటపల్లి చట్టన్నవరం వాగుల్లో వరద నీరు ప్రవహిస్తుంది. మండలంలో ఏనుగు గడ్డ వాగు, తోళ్ల వాగు, నక్కల వాగు, లక్ష్మయ్య బాబు, రాళ్ల వాగు తదితర వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎన్‌టిఆర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద ఉధృతి కారణంగా జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ ఆదేశాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు 14వ తేదీ గురువారం సేవలు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యువి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: భారీ వర్షాలతో పాటు కృష్ణానదికి భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్




హెచ్‌ఎం ధ్యాన చంద్రతో కలిసి విజయవాడలో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 6 గంటల నుండి పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, నిర్మలా కాన్వెంట్ రోడ్, గుణదల సెయింట్ జోన్స్ స్కూల్, ఈఎస్ఐ రోడ్ దేవినగర్ మద్యకట్ట తదితర ప్రాంతాలలో పర్యటిస్తూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న రెండు మూడు రోజుల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్థాయిని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పులిచింతల, మున్నేరు, క్యాచ్‌మెంట్ ప్రాంతాల ద్వారా కృష్ణాకు వరదనీరు పోటెత్తే అవకాశం ఉందన్నారు. 91549 70454 నంబరుతో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. బుడమేరుకు వరదలంటూ వచ్చే వదంతులను నమ్మవద్దన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించాలి : మేయర్

ప్రజాశక్తి-విజయవాడ: భారీ వర్షాలకు నీటిముంపుకు గురైన నగరంలోని ఆయా లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులను కోరారు. విజయవాడ నగర పరిధిలోని బుడమేరు వాగు పరివాహక ప్రాంతాలలో నివసిస్తూ నిరాశ్రయులయిన ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి అన్ని వసతులు కల్పించాలని అన్నారు. కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ ఎటువంటి భయభ్రాంతులకు గురి అవ్వకుండా ఉండాలని అన్నారు. వరదల గురించి ఎటువంటి వదంతులు నమ్మవద్దని అన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి పశ్చిమ నియోజకవర్గం పాతబస్తీలోని 53వ డివిజన్ గులాం మొహిద్దీన్, సుబ్బరామయ్య వీధిలో యుజిడి ట్రంక్ లైన్ మరమ్మతుల కోసం తవ్విన మ్యాన్‌హోల్లో పడి టి.మధుసూదనరావు (51), ఎస్‌కె ముతూ జాన్ (38) సుబ్బరామయ్య వీధిలో అవుట్‌ఫాల్ డ్రెన్‌లో పడి మరణించారు. మృతుల కుటుంబ సభ్యులను సిపిఎం ఫ్లోర్ లీడర్, పశ్చిమ నగర కార్యదర్శి బి.సత్యబాబు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే రోడ్లో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా మూడు చోట్ల భారీగా గోతులు తవ్వడం, రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇద్దరు ఇరువురు మరణించారని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు 25 లక్షల ఎక్స్గ్రేషియాతో పాటు జక్కంపూడిలో ఇళ్లను కేటాయించాలని, కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.సూరిబాబు. ఎస్ కే సలీం, పి.ప్రసాద్, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.





విజయవాడలో రోడ్డుపై నిలిచిన నీరు

నీట మునిగిన పొలాలు

- వందలాది ఎకరాల్లో వరి పొలాలు మునక
- అవనిగడ్డలో 13.52 సె.మీ వర్షపాతం నమోదు
- లంక గ్రామాల్లో పడవలపై ప్రజల ప్రయాణం
- కృష్ణానదికి వరదతో తీరప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు


కోడూరు మండలంలో నీట మునిగిన పొలాలు

కృష్ణాజిల్లాలో మంగళవారం నుంచి కురిసిన భారీ వర్షాలకు పంటపొలాలు నీటమునిగాయి. వందలాది ఎకరాల్లో వరి పంట నీటమునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి 15 వేల రూపాయల పెట్టుబడి పెట్టి నాట్లు వేశామని, వర్షానికి పొలాలన్నీ నీటమునిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో లంక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో భారీ వర్షపాతం నమోదయింది. మంగళవారం సాయంత్రం 7:30 గంటల నుండి ప్రారంభమైన కుండపోత వర్షం రాత్రి 10 గంటల వరకు ఏకధాటిగా 13.52 సెంటీమీటర్లవర్షం నమోదయింది. దీనితో పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అవడంతో పాటు అవనిగడ్డ బస్టాండ్ సెంటర్లోని కారు స్టాండ్ వద్ద నుండి 8వ వార్డు నందు గల సెవెంత్ డే పాఠశాల వరకు ప్రధాన రహదారిపై నీళ్లు నిలవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు రెండో వార్డ్ లోని ఎస్టీ కాలనీ సింహాద్రి కాలనీ మండల పురం ఏడవద్దు తొమ్మిదవ వార్డులో వర్షపు నీరు నిలిచిపోవడంతో 9వ వార్డులో ఇళ్లల్లో కూడా వర్షపు నీరు ప్రవేశించింది.ఎటు చూసినా అవనిగడ్డలో వర్షపు నీరే కనిపిస్తుంది.

నీట మునిగిన పంట పొలాలు : భారీ వర్షాలకు మండలంలోని అశ్వరావుపాలెం, మోదుమూడి పరిసరాల లోని వందలాది ఎకరాలలో పంట పొలాలు నీట మునిగాయి. ఎటు చూసినా వర్షపు నీటితో నిండిపోయిన పంట పొలాలు చెరువుల లాగా కనిపిస్తున్నాయి. కాగా మం డల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామంలో ఒకటవ నెంబర్ కాలు వంతెన భారీ వర్షానికి స్లాబ్ కూలిపోవడంతో ఆర్ అండ్ బి అధికారులు డి ఈ రమేష్ పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకో వాలని జీవి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వ రరావు కోరారు. మరోవైపు ఆర్టీసీ డిపో సైతం వర్షపు నీటితో నిండిపోయింది.

మరోసారి కృష్ణా నదికి వరద

ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు మూడు లక్షలకు పైగా క్యూసెక్కుల వరద నీటిని సముద్రానికి వదులు తున్నట్లు అధికారులు హెచ్చరించడంతో అవనిగడ్డలోని ఇరిగేషన్, రెవిన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. నదీ గర్భంలో గ్రామాలైన పాతఎడ్లలంక, వసుమట్ల, దక్షిణ చిరువోలు లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. నదిగర్భంలో ఉన్న పాత ఎడ్ల లంక గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధం తెగిపోయింది. మన వైపు దక్షిణ చిరువలంక శివారు గ్రామాలైన మేడిలంక, అయ్యవారిపాలెం, అరటిలంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు పులిగడ్డ ఆక్విడేట్టు వద్ద వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. **ప్రజాశక్తి-కోడూరు** : కోడూరు మండల వ్యాప్తంగా పల్లపు పొలాలు నీట మునిగిపోయాయి. వి కొత్తపాలెం, చిన్నగుడుమోటు, జరుగువానిపాలెం, తదితర గ్రామాలలో భారీ వర్షం కారణంగా పంట పొలాలు నీట మునిగాయి. డ్రైనేజీలు పొంగడంతో నీరు బయటికి వెళ్లకుండా ఉండడం, పొలాల్లో నీరు నిలిచిపోయి రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పొలాల్లో ఉన్న నీరును బయట తీసుకురావడానికి రైతులు ఉదయం నుండి కూడా పొలాల వద్ద ఉంటూ నీటిని బయటకు పంపిస్తున్నారు. వి.కొత్తపాలెం గ్రామంలో అయితే పంట పొలాలు మొత్తం చెరువులను తలపిస్తున్నాయి.

చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలంలో వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్ష బీభత్సానికి నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. పల్లపు ప్రాంతాల్లో వందల ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. బొడ్డపాడు, చినపులిపాక, వల్లూరుపాలెం, రొయ్యూరు ఎగువ గ్రామాల నుంచి వర్షపు నీరు అధికంగా వస్తుంది. దీనితో పల్లపు ప్రాంతమైన తోట్లవల్లూరులోని వరి పొలాలు పూర్తిగా నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

తోట్లవల్లూరు వద్ద కృష్ణానది పాయ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో లంక గ్రామాలలోని ప్రజలు నాటు పడవల పై ప్రయాణాలు సాగిస్తున్నారు. నిత్యావసర సరుకులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటిని విజయవాడ ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తి దిగువకు వదలడం వలన వరద ప్రవాహం పెరుగుతుంది. 3.96 లక్షల క్యూ సెక్కుల వరకు వరదనీరు ప్రస్తుతం కొనసాగుతుందని, ఇంకా పెరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కుసుమకుమారి తెలిపారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : మండలంలో గత రాత్రి కురిసిన వర్షానికి పంట పొలాలు తటాడాకాలుగా మారాయి. మండలంలో 706 హెక్టార్ల వరి పైరు ముంపు గురైనట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మండల పరిధిలోని నిమ్మగడ్డ యార్లగడ్డ, వక్కలగడ్డ, పురిటిగడ్డ, పాగోలు,, నూకలవారి పాలెం చింతలమడ గ్రామాలలో వరి ముంపుకు గురికాగా లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. స్థానిక నారాయణరావు నగర్ కాలనీలోని లోతట్టు ప్రాంతం జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొలిటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తటాకాన్ని తలపించేలా నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-పామర్రు : పామర్రు నుండి గుడి వాడ వెళ్లే జాతీయ రహదారిపై పామరు సమీపంలో ఉన్న హైవే ప్లై ఓవర్ వంతెన కింద వర్షం నీరు నిండిపోవడంతో వాహనదారుల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్లై ఓవర్ నిర్మించిన వారు వర్షం నీరు పోవడానికి ఏర్పాటు చేసిన డ్రైనేజీని పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో సమస్య తలెత్తింది.




నీట మునిగిన అవనిగడ్డ ఆర్టీసీ బస్టాండ్


అవనిగడ్డ ప్రధాన రహదారిపై వర్షపు నీరు


అవనిగడ్డ మండలంలో నీట మునిగిన పొలాలు


చల్లపల్లి మండలంలో నీట మునిగిన పొలాలు


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్ఛార్జి కలెక్టర్

అప్రమత్తంగా ఉన్నాం

- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలు, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉన్నామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ, రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనితకు వివరించారు.జిల్లాల్లో అధిక వర్షాలు, వరదలు దష్ట్యా రాష్ట్ర హెూంశాఖ మంత్రి బుధవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జిల్లాలోని పరిస్థితులను వివరిస్తూ గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు, కష్ణా నదికి పెరుగుతున్న వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. జిల్లాలో దుర్బలత్వం కలిగిన 62 గ్రామాలు, అదేవిధంగా 16 లంక గ్రామాలు ఉన్నాయని, గత సంవత్సరంలో సంభవించిన వరదలను దష్టిలో ఉంచుకొని ప్రస్తుత విపత్తులను ఎదుర్కొనేందుకు ఆయా మండలాల అధికారు లను ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్లో కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, సిపిఓ ఎస్ భీమరాజు, జిల్లా పౌర సరఫరాల అధికారి జి మోహన్ రావు పాల్గొన్నారు


కోడూరు మండలంలో నీట మునిగిన పొలాలు


నీట మునిగిన పొలాలు పరిశీలన




ప్రజాశక్తి-చల్లపల్లి : గత రాత్రి కురిసిన వర్షాలకు ముంపుకు గురైన వరి పొలాలను ప్రజాసంఘాల నాయకులు బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు చింతలమడలోని ముంపు గురైన కౌలు రైతు పొలాలను మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బండారు కోటేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ మహమ్మద్ కరిముల్లా రైతులతో కలిసి గ్రామంలో పర్యటించి నీట మునిగిన వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే 15 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసిన రైతులను అన్ని విధాల ప్రభుత్వ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. **ప్రజాశక్తి-నాగాయలంక** : మండల పరిధిలోని నంగేగడ్డ, మర్రిపాలెం గ్రామాలలో కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన పంట పొలాలను అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.


అవనిగడ్డ నీట మునిగిన గ్రౌండ్


కోడూరు మండలంలో నీట మునిగిన పొలాలు


అవనిగడ్డలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద వర్షపు నీరు


అవనిగడ్డలో ఇళ్లలోకి చేరిన నీరు



కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కార్మికుల సమస్యలు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జ్యోతిబస్ డిమాండ్ చేశారు. కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రెండో మహాసభ మచ్చర్ పాయింట్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేస్తామని, సమ్మె హామీలు అమలు చేస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిందని, వాటిని అమలు చేయాలని కోరారు. ఇటీవల ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో పెంచిన జీతాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా యం.మహేష్, ప్రెసిడెంట్ గా జి.సురేష్, జనరల్ సెక్రటరీగా టి.కృష్ణ, కోశాధికారిగా బి.నవీన్, వైస్ ప్రెసిడెంట్స్‌గా బి.అప్పారావు, కరెంటు శ్రీను, దేవుళ్లు, రత్నారావు, రామ లక్ష్మమ్మ, జాయింట్ సెక్రటరీగా బి.రమణ, వి.శ్రీను, టి.సూరిబాబు, ఎస్.శ్రీను కమిటీ సభ్యులుగా ఆర్.శ్రీను, బి.మణికంఠ, యేసు, సూర్యలక్ష్మి, ప్రమీల, శివరామకృష్ణ, నోజ్ ఎన్నికయ్యారు.


విద్యుత్ షాక్‌తో మరొకరు మృతి

జయంతిలో విషాదం

ప్రజాశక్తి-వీరులపాడు: రెండు రోజుల్లో విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతిచెందిన సంఘటన మండలంలోని జయంతి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వల్లిబోయిన గోపి (35) ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పొలంలో పనులు ముగించుకుని ప్రొక్లెయిన్‌తో తిరిగి వస్తున్నాడు. వాహనానికి 11 కేవీ విద్యుత్ తీగ తగులుతుందని గమనించి కర్ర సహాయంతో తీగను పక్కకు జరపడానికి ప్రయత్నించగా అది ప్రమాదవశాత్తు జారి అతనిపై పడింది. విద్యుత్ షాక్‌కు గురైన గోపి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వీరులపాడు ఎస్ఐ అనిల్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం గ్రామంలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా జూనియర్ లైన్‌మెన్ నాగేశ్వరరావు మృతిచెందాడు. రెండు రోజుల వ్యవధిలో విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎన్ఆర్ఐలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 5, 6 తేదీలలో 'నవతరం మేధస్సు కోసం క్వాంటం ఏఐ-డీప్ టెక్‌లో సాంకేతిక ఆవిష్కరణలు' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని కళాశాల చైర్మన్ ఆర్.వెంకటరావు తెలిపారు. కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ వారి సహకారంతో రెండు రోజుల సదస్సు జరుగుతుందని అన్నారు. ప్రాంతీయ భాషలో సాంకేతిక విద్యకు సంబంధించిన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పుల గురించి చర్చిస్తారని అన్నారు. భారతీయ. భాషల్లో జ్ఞానాన్ని పంచుకోవడం, ఆలోచనల మార్పిడి, సహకార అభ్యాసం తదితర అంశాల గురించి అతిథులు ప్రసంగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్స్ కో కన్వీనర్, కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ రవికిరణ్, డాక్టర్ పి.భాస్కర్ నాయుడు, కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ కె.వి.సాంబశివరావు పలువురు పాల్గొన్నారు.



మార్కెట్లోకి పోకో ఎం7 విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: పోకో సరసమైన స్మార్ట్‌ఫోన్ విభాగంలో పోకో ఎం7 ప్లస్ 5 జీని మార్కెట్లోకి ప్రవేశపెట్టిందని ఫోకో మొబైల్ విభాగ ఇంచార్జి పి.రాంబాబు తెలిపారు. ఎం.జీ.రోడ్‌లోని పోకో మొబైల్ డీలర్ షోరూంలో ఆయన మాట్లాడుతూ పోకో ఎం7 ప్లస్ 5జీ భారీ 7000 ఎంఎహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ, 144 హెచ్ జెడ్ రిఫ్రెష్ రేట్‌తో మద్దతు ఇవ్వబడిన 6.9 అంగుళాల ఎఫ్ హెచ్ డీ ప్లస్ డిస్‌ప్లేతో ముందంజలో ఉందన్నారు.

ముంపు నివారణలో ప్రభుత్వం విఫలం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరుకు వరద వచ్చి సంవత్సర గడిచినా ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు పేర్కొన్నారు. బుడమేరు మధ్యకట్టలోని విజయదుర్గానగర్, తమ్మిన దుర్గారావు నగర్, లెనిన్ నగర్, గుణదల తదితర ప్రాంతాలలో సిపిఎం నేతలు బుధవారం పర్యటించారు. వర్షపు నీటిలోని ప్రజలను పరామర్శించారు. నీట మునిగిన ఇళ్లను సందర్శించారు. గుణదల బుడమేరు వంతెనపై ప్రవహిస్తున్న నీటితో పాటు స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ భారీ వర్షాలతో బుడమేరు నీటి ప్రవాహం పెరుగుతుందని, లోతట్టు ప్రాంతాలలో కొన్ని ఇళ్లు నీట మునిగాయని అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు గుణదల వంతెన పైగా నీరు ప్రవహిస్తుందన్నారు. వరద ముంపు లేకపోయినా, సరైన సమాచారం అధికార యంత్రాంగం ఇవ్వకపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారని అన్నారు. గత అనుభవాల రీత్యా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలకు నిధులు మంజూరు చేయలేదని, టెండర్లు పిలవలేదని ధ్వజమెత్తారు. చెరువు కట్టలు తెగిన కొన్నిచోట్ల మరమ్మత్తులు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. ముంపు నివారణకు 7 వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని అడిగినా, పైసా విడుదల చేయలేదని, ఇటువంటి నేపద్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఒత్తిడి చేయడం లేదని అన్నారు. ముందుచూపుతో వ్యవహరించాల్సిన పాలకులు ప్రచార ఆర్భాటంతో సరిపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తక్షణ చర్యలు తీసుకోవాలని, గుర్రపు డెక్క తొలగించాలని, ఎప్పటికప్పుడు ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు టి. ప్రవీణ్, సిహెచ్ శ్రీనివాస్, స్థానిక నేతలు జి.వెంకటేశ్వరరావు, ఎం అజయ్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



నీట మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

విజయవాడలో 39 పునరావాస కేంద్రాలు

ప్రజాశక్తి-విజయవాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నిరాశ్రయులకు పునరావాసం కల్పించేందుకు విజయవాడ నగరంలోని మూడు సర్కిల్స్ పరిధిలో 39 పునరావాస కేంద్రాలను నగరపాలకసంస్థ అధికారులు ఏర్పాటు చేశారు. సర్కిల్-1 పరిధిలో 13, సర్కిల్-2 పరిధిలో 19, అలాగే సర్కిల్-3 పరిధిలో మరో ఏడు సెంటర్లను ఏర్పాటు చేశారు. బాధిత ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. ఈ మేరకు బుధవారం పునరావాస కేంద్రాల వివరాలను ఆయన తెలిపారు. సర్కిల్-1 పరిధిలో...50వ డివిజన్‌లోని మహంతిపురం అండ్ ఎస్‌కెఎస్ఆర్ఎంసి , పరుసురామయ్య వీధిలోని ఎస్ఎంసిఎంసి ఎలిమెంటరీ స్కూల్, 37వ డివిజన్ గాంధీజి మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, 56వ డివిజన్ మోటూరు హనుమంతరావు యర్రకట్టరోడ్డు, 43వ డివిజన్ విఎంసి కళ్యాణమండపం, 45వ డివిజన్ జిఎన్ఆర్ ఎలిమెంటరీ స్కూల్, 43వ డివిజన్ ఎంఎల్‌సిబి స్కూల్, 55వ డివిజన్ మోటూరు హనుమంతరావు స్కూల్, వెల్లంపల్లి ఫౌండేషన్ కళ్యాణమండపం, 56వ డివిజన్ కెబిఎన్ కళాశాల, ఇదే డివిజన్ కేదరేశ్వరపేటలోని విఎల్ దత్తు స్కూల్, విఎంసి మ్యాంగోమార్కెట్ కళ్యాణమండపం, కెబిఎన్ ప్రయివేటు కళాశాల, రూరల్ జక్కంపూడి కాలనీలోని ప్రభుత్వ స్కూల్ అండ్ కమ్యూనిటీ హాలు, సర్కిల్-2 పరిధిలో... 59వ డివిజన్‌లో బూదల ఆదెమ్మ కమ్యూనిటీ హాలు, ఎంకె భేగ్ స్కూల్, వివేకానంద, శ్రీరామ్ స్కూల్, 60వ డివిజన్ డి బ్లాక్ కమ్యూనిటీ హాలు అండ్ జెడి ఎంఎంసి స్కూల్స్, 61వ డివిజన్ 257 సచివాలయం, ఇదే డివిజన్‌లోని మోటూరు హనుమంతరావు కమ్యూనిటీ హాల్ అండ్ శారద స్కూల్, 32వ డివిజన్ క్షత్రియ ప్రయివేటు భవన్, ఇదే డివిజన్‌లోని సర్యా ప్రయివేటు స్కూల్, 58 డివిజన్ భరతమాత మందిర్, గుజ్జల సరళాదేవి కమ్యూనిటీ హాలు, ఇదే డివిజన్‌లోని వైఎస్ రెడ్డి అండ్ ఎస్ కన్వెన్షన్, 57వ డివిజన్ కేర్ అండ్ షేర్ హైస్కూల్, 62వ డివిజన్‌లో ఎస్‌పిఎస్ హైస్కూల్ అండ్ ఎలమెంటరీ స్కూల్, కాపు కమ్యూనిటీ హాలు, ఇదే డివిజన్‌లోని రాధానగర్ కమ్యూనిటీ హాలు, అండ్ బిసి గర్ల్ హాస్టల్, 64వ డివిజన్ ప్రజాక్తి నగర్ కళ్యాణమండపం, ఇదే డివిజన్‌లోని బివి సుబ్బారెడ్డి హైస్కూల్, లగడపాటి కళ్యాణమండపం, 1వ డివిజన్ టిఎంఆర్ అండ్‌సిఎంఆర్ ప్రభుత్వ హైస్కూల్, 30వ డివిజన్ ఎకెటిపి స్కూల్, ప్రశాంతి స్కూల్, 30వ డివిజన్ జిఎస్ఆర్ ఎంసి ఇ.ఎం స్కూల్, విజ్ఞాన విహార్ స్కూల్, టిడిఆర్ఎంసి ఇంగ్లీషు మీడియం స్కూల్, రైల్వే ఇనిస్టిట్యూట్, దుర్గాపురం ఎస్‌టివిఆర్ స్కూల్, 28వ డివిజన్ దుర్గాపురం ఎస్‌టివిఆర్ స్కూల్, సర్కిల్-3 పరిధిలో....15వ డివిజన్‌లోని పటమటలంక విఎంసి హైస్కూల్, ఇదే డివిజన్‌లోని పటమటలంక విఎంసి ప్రైమరీ స్కూల్, 16వ డివిజన్ పటమట జిడిఇటి స్కూల్, 17వ డివిజన్ సిద్ధం కృష్ణారెడ్డి కమ్యూనిటీ హాలు, 18వ డివిజన్ న్యూ కమ్యూనిటీ హాలు, 20వ డివిజన్ విఎంఆర్‌స్కూల్, 21వ డివిజన్ ఎపిఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.



ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం: ప్రభుత్వం, ప్రైవేట్ హాస్పిటల్స్ కలిసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మైలవరంలో నూతనంగా నిర్మించిన ప్రైవేటు ఆసుపత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వైద్య ఆరోగ్య పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మైలవరం లాంటి మారుమూల ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌ను అందుబాటులోకి తెచ్చిన డాక్టర్ హరిప్రసాదును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ బోర్డు హాస్పిటల్ ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. ఎన్‌టిటిపిఎస్ బోర్డు హాస్పిటల్‌ను ప్రైవేటీకరణ చేయొద్దని, పూర్తి సదుపాయాలతో కూడిన యాజమాన్యమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హాస్పిటల్ వద్ద కార్మికులు నిరసనకు దిగారు. డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ యాజమాన్య తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపకపోతే ప్లాంట్‌ను షట్ డౌన్ చేస్తామని హెచ్చరించారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో కనీసం చర్చించకుండా ప్రయివేటీకరణ చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.





ముంపు ప్రాంతాల్లో తాతయ్య పర్యటన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఊర చెరువు, ఎర్రకాలువ, యాపల వాగు ముప్పు ప్రాంతాలను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాలనీలు ముంపు బారిన పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా యాపల వాగు, ఎర్రకాలువ వరదనీరు ఊర చెరువులోకి సులభంగా చేరేందుకు ఉన్న అన్ని అడ్డంకులను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు ఇర్రి నరసింహారావు, పేరం సైదేశ్వరరావు, కరణం నరసింహారావు, గింజుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-నందిగామ: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక చైతన్య కళాశాల నుండి గాంధీబొమ్మ విగ్రహం వరకు 79 మీటర్ల జాతీయ జెండాతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపినాయక్ మాట్లాడుతూ నేటికీ దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రమయ్యాయని అన్నారు. అందరికి విద్య, ఉపాధి నేటికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రాంతాల మధ్య విభేదాలు గొడవలు సృష్టించి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని కేంద్రంలోని బిజెపి చూస్తుందని విమర్శించారు. మహిళలకు భద్రత కరువైందన్నారు. మణిపూర్ ఘటన దేశాన్నీ దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే పాలకులని రాజ్యాంగం చెబుతుంటే మన పాలకులు మాత్రం ప్రజలను బానిసలు అన్న రీతిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే హక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని అన్నారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో దేశ అభివృద్ధి, పురోగతి కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని, దేశాన్ని విచ్ఛిన్నం చేసే బిజెపి విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి షేక్ ఖాజ, అధ్యక్షుడు నరసింహ, నాయకులు అభిషేక్, వెంకటేష్, ప్రసాద్, ప్రజాసంఘాల నాయకులు కే.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశకి-మైలవరం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం మండలం తోలుకోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. చైర్మన్గా కోటగిరి వెంకటేశ్వరరావు, సభ్యులుగా పామర్తి దశరథ, గొట్టి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాల మేరకు అన్నదాతలకు సొసైటీ సభ్యులకు విశేష సేవలు అందించాలని సూచించారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు : ఎస్‌పి

- మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో 'నషా ముక్త్ భారత్ అభియాన్' లో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాదకద్రవ్యాలను నిర్మూలిస్తామని, మాదకద్రవ్యాల జోలికి యువతను వెళ్ళనివ్వకుండా పటిష్ట చర్యలు చేపడతామని పోలీస్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవి ష్యత్తును కోల్పోతుండటం ఆందోళన కల్గించే విషయ మ న్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పి సత్య నారాయణ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : నేటి సమాజంలో యువత ముఖ్యంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులవుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని జిల్లా ఎక్సైజ్ అధికారి జి గంగాధర్ రావు అన్నారు. నషా ముక్త భారత్ అభియాన్ ఏర్పడి ఐదు సంవత్సరాలు అయిన సందర్భంగా కష్ణాజిల్లా మచిలీ పట్నంలోని పద్మావతి మహిళ కళాశాలలో బుధవారం డ్రగ్స్ కు వ్యతిరేకంగా కార్యక్రమం నిర్వహించారు.ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాల సమాచారం1912 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందజేయాలన్నారు. అనంతరం పోస్టర్లు రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలకలపూడి పోలీస్ స్టేషన్ ట్రైనింగ్ సబ్ ఇన్స్పెక్టర్ వేమన చందన, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి అన్నపూర్ణ, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపర్డెంట్ అధికారి భార్గవ్, ఎన్జీవో నేత ఆకూరి శ్వేత తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పమిడిముక్కల :** డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు అని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషా అన్నారు. బుధవారం మండలంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ బాగా చదువుకొని విజ్ఞానాన్ని అభివద్ధి చేసుకోవాల న్నారు. అంగన్వాడి కార్యకర్త విజయనిర్మల పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ:**మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ పీఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు ఉత్పత్తులు, గంజాయి, లాంటి మాదకద్రవ్యాలతో ఆరోగ్యాలను చెడగొట్టుకోవద్దని హితవు పలికారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు వద్దు ఆరోగ్యమే ముద్దు నినాదాలతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిడిపిఒ ఎస్ ప్రసన్న విశ్వనాథ్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్. శ్రీదేవి, మొవ్వ సెక్టార్ సూపర్వైజర్ రత్నమాల, పాల్గొన్నారు.

పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు

- కృష్ణాజిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : పాఠశాల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో పాఠశాల విద్య నిర్మాణ అంశాలుపై మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యా యులకు నిర్వహించిన ఒక రోజు జిల్లా స్థాయి కార్యశాల కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ దార్శనికత 2047 నాటికి భారతదేశాన్ని అభివద్ధి చెందిన దేశంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ క్రమంలో పాఠశాల విద్య మెరుగుదలకు విద్యాధికారులందరూ కషి చేయాలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సబ్జెక్టుపై పట్టు సాధించే విధంగా నాణ్యమైన విద్య, అవసరమైన నైపుణ్యాలు అందించాలని సూచిం చారు. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్యం చాలా ముఖ్యమని పేర్కొంటూ, ఆ దశలో వారికి వేయాల్సిన అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలను అందించాలని, రక్తహీనత నివారణకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో పీవీజే రామారావు, జెడ్పి డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని సింగ్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి పాల్గొన్నారు.

బందరులో కృతజ్ఞతా ర్యాలీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా చేసి చూపించేందుకు అహర్నిశలు శ్రమించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సాయం అందించిన నేపథ్యంలో బందరు మండలం ఎస్ ఎన్.గొల్లపాలెం నుండి మార్కెట్ యార్డు వరకు 250పైగా ట్రాక్టర్లతో ర్యాలీ బుధవారం కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు కేంద్రం రూ.6 వేలు ఇస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి రూ.20 వేలు అందిస్తున్నామన్నారు. పంట అమ్ముకునే రైతులు డబ్బులు ఎప్పుడొస్తాయా అని ఎదురు చూడకూడదనే లక్ష్యంతో.. 24 గంటల్లోనే నిధులు జమ చేస్తున్నామని, రైతు పంట అమ్ముకుని ఇంటికి వచ్చేలోగా డబ్బులు జమ చేశాం అన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.12 వేల కోట్ల నిధులు రైతులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారా యణరావు , తెలుగు రైతు విభాగం అధ్యక్షులు, వ్యవసాయ మిషన్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి , కష్ణా జిల్లా రైతు అధ్యక్షులు గోపు సత్యన్నారాయణ ,పార్టీ సీనియర్ నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం లోని స్థానిక వై జె ఆర్ డి ఎం ఎస్ ఇంజినీరింగ్ కళాశాల లో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యం లో "ర్యాగింగ్ చట్టాలు" అనే అంశం మీద విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా సీనియర్ సివిల్ జడ్జ్ కే వి రామకష్ణయ్య పాల్గొని విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించి ర్యాగింగ్ వల్ల అనర్థాలు, ర్యాగింగ్ కు పాల్పడం వలన విధించబడే శిక్షలు వాటి పర్యావసనాలు వివరించారు. సినియర్ అడ్వకేట్ ముసలయ్య సోషల్ మీడియా ప్రమాదాల గురించి విశ్లేషించగా, సైకాలజిస్ట్ సుబ్రమణ్యేశ్వరరావు మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గురించి విశదీకరించారు. తాలూకా పోలీస్ స్టేషన్ ఎ ఎస్ ఐ వర్మ ట్రాఫిక్ నియమ నిబంధనలు, వివిధ చట్టములపై ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు టి రవి కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టరు నాగజ్యోతి, ఇతర విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

ప్రజాశక్తి-చల్లపల్లి : మండలంలో మంగళవారం నుంచి భారీగా వర్షాలు కురుస్తుండడంతో గుర్రపు డెక్క కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవనిగడ్డ మండలి బుద్ధ ప్రసాద్ ఆదేశాల మేరకు గుర్రపుడెక్క తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. చల్లపల్లి మండల పరిధిలోని పుచ్చగడ్డ సమీపంలో ఉన్న చిల్లల వాగు వద్ద ఉన్న గుర్రపు డెక్కను యంత్ర సహాయంతో తొలగింపు పనులు అధికారులు బుధవారం చేపట్టారు. శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఈ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మార్కుల కోసం కాకుండా జ్ఞానం కోసం విద్యను అభ్యసించాలని రాష్ట్ర డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి జి వి వి సత్యనారా యణమూర్తి కోరారు. వార్షికంగా సాంకేతిక విద్యా మండలి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు అధికారికంగా ప్రకటించిన పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ విద్యలో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ లలో రాష్ట్ర మొదటి ర్యాంకర్ కు, ప్రైవేట్ పాలిటెక్నిక్ లలో మొదటి, ద్వితీయ ర్యాంకర్స్ కు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్.పాలిటెక్నిక్, గుడ్లవల్లేరు వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వి.వి.ఆర్.ఎస్.ఆర్ స్మారక అవార్డుల ప్రదానోత్సవం గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం 2025వ సంవత్సరంలో రాష్ట్రంలో అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ లలో మొదటి ర్యాంకు సాధించినఆలూరి లలిత కుమారి, అలాగే రాష్ట్రంలో అన్నీ ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో ద్వితీయ ర్యాంకు సాధించిన శ్రీ వాసవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ నందమూరు పాలిటెక్నిక్ కు చెందిన విద్యార్థి అంకెం అఖిలా దేవికి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు ముఖ్యఅతిథి అందించారు. సంస్థల కో - సెక్రటరీ, కరెస్పాండంట్ వల్లూరు పల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్, ప్రెసిడెంట్ వల్లభనేని సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ కొడాలి కష్ణారావు, ఎస్.ఆర్. జి.ఇ.సి. ప్రిన్సిపాల్ శ్రీ డా. బి కరుణ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.




ర్యాంకర్లకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వ్యక్తి జీవితంలో వ్యక్తిత్వం వికసించడానికి సంగీతం సాహిత్యాలు శక్తివంతమైన సాధనాలు అని కందుల లక్ష్మి నరసమ్మ అన్నారు. స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జీరో సెమిస్టర్ లో భాగంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు నేటి రోజు 'సినీ సంగీతంలో వ్యక్తిత్వ వికాస పరిమళం' అను అంశంపై తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయ వాడలో ఉన్న జి.వి.ఆర్. ప్రభుత్వ సంగీత, నత్య కళాశాల, గాత్ర ఉపన్యాసకులు కందుల లక్ష్మి నరసమ్మ విచ్చేసి మాట్లాడారు. సంగీత సాధన ద్వారా వ్యక్తి లేదా విద్యార్థుల మనస్తత్వానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎలా దోహదం చేస్తుందో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి. హెచ్.శాస్త్రి పాల్గొన్నారు.

వృత్తి విద్యతో మహిళల ఆర్థిక స్వావలంబన



ప్రజాశక్తి - పామర్రు : వృత్తి విద్యతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించ వచ్చని మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్పర్సన్ పీతల సుజాత అన్నారు. బుధవారం మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో ఉన్న మహిళా ప్రాంగణాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వత్తి విద్యను అభ్యసించి తద్వారా ఉపాధిని ఏర్పరచుకుంటే మహిళలు ఆర్థికంగా కుటుంబ అభివద్ధికి ఉపయోగపడతారని తద్వారా వారికి స్వావలంబన ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలు రంగాలలో వత్తి శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రాంగణాన్ని పరిశీలించి అభివద్ధికి కావలసిన నిధులను సమకూరుస్తానని హామీ ఇచ్చారు. తొలుత గ్రామంలోని స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ దంపతుల కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు పల్లి గణేష్,ఈడి.భాను శ్రీ, డి ఎం. జుబేదా పర్వీన్, సూపరింటెంట్ శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు : ఏడిఎ

ప్రజాశక్తి పామర్రు : పామర్రు మండలంలోని ఎరువుల డీలర్స్ ఎరువులను అధిక ధరకు అమ్మితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పామర్రు ఏడిఏ స్వర్ణలత హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఎరువుల షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియ ఇతర ఎరువులు ఎమ్మార్పీ రేటు పైనే అమ్మాలని లేనిచో అట్టివారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల నిల్వలను తెలిపే స్టాకు బుక్కు, బిల్లు బుక్ , రిజిస్టర్ బుక్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లును ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో శివ నాగరాణి, ఎరువుల షాపుడీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంపు మళ్లింపు చర్యలు వేగవంతం

ప్రజాశక్తి-కోడూరు : కుండపోత వర్షం కురిసిన నేపథ్యంలో నియోజకవర్గంలో ముంపు మళ్ళింపు చర్యలు వేగవంతం చేసినట్లు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం పీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రైనేజీ శాఖ అధికారులు కోడూరు మండలం జరుగువానిపాలెం నుంచి ఇరాలి వరకూ రత్నకోడు మేజర్ డ్రైనేజీపై వలకట్ల తొలగించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ముంపు సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ అవరోధాలు తొలగిస్తున్నట్లు తెలిపారు. ఔట్ ఫాల్ స్లూయిజుల వద్ద తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డ్రైనేజీ శాఖ అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలిసి నిరంతర పర్యవేక్షణతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబు నాయక్, కోడూరు డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మర్రె గంగయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికను సద్వినియోగం చేసుకోవాలని వ్యక్తిగత సమాచార రక్షణ పై మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుడివాడ డి.ఎస్.పి వి ధీరజ్ వినీల్ మాట్లాడుతూ విద్యార్థులు వారి దైనందిన జీవిత కార్యకలాపాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం వలన సైబర్ నేరగాళ్లకు అవకాశం ఇస్తున్నారని సవివరంగా వివరించారు. గుడివాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ ఎల్ ఆర్ సోమేశ్వరరావు, గుడ్లవల్లేరు ఎస్సై వివి సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.











స్వాతంత్రోద్యమ శంఖారావం

- దేశభక్తిని చాటిచెప్పేలా ప్రదర్శనలు
- ఆకట్టుకున్న విద్యార్థుల కళారూపాలు

ప్రజాశక్తి-విజయవాడ: 79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జాషువా సాంస్కృతిక వేదిక, అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో 'స్వాతంత్రోద్యమ శంఖారావం' పేరుతో ఎంబివికె ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కళారూపాల ప్రదర్శన ఆకట్టుకుంది. దేశభక్తిని చాటి చెప్పేలా నగరంలోని ఆయా పాఠశాలల నుంచి వచ్చిన వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సౌత్ ఆఫ్రికా ఆఫ్రికా ప్రజల కోసం, నల్ల జాతి ప్రజల కోసం పోరాడిన నెల్సన్ మండేలా జీవిత విశేషాలపై కెవిఎస్ స్కూల్ విద్యార్థులు, అమలీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాటలపై నృత్యాలు చేశారు. రుషి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వేసిన మన్య పోరాటం అల్లూరి సీతారామరాజు నాటిక, క్రాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు భగత్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా వేసిన మా గమ్యం నాటిక, ఎస్ఎల్ఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు వేసిన వీరగంధం కన్నెగంటి హనుమంతు చరిత్ర నాటికలు ఆలోచింపజేశాయి. దేశమంటే మట్టి కాదోయ్...దేశమంటే మనుషులోయ్ అనే పాటకు విద్యార్థులు వేసిన డాన్స్ విశేషంగా ఆకట్టుకుంది. వివేకానంద హై స్కూల్, కెఆర్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీరామ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కెసి ఇంగ్లీష్ మీడియం స్కూల్, రాయల్ హై స్కూల్ విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యాలను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం మాట్లాడుతూ ఆనాటి వీరుల త్యాగాలు నాటికలు, పాటలు ద్వారా చిన్నారులు ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. వీరుల త్యాగాలు ఈనాటి చిన్నారులే కాపాడుకావాలని పిలుపునిచ్చారు. అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ తదితరులు మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే విద్యార్థిని విద్యార్థులు స్వాతంత్ర పోరాట యోధుల జీవిత చరిత్రలను నాటికల ద్వారా ప్రదర్శించడం, వారి ప్రతిభను వెలికితీయడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఈ నాటికలకు దర్శకత్వం వహించిన దర్శకులు, ప్రముఖ నాటికల దర్శకులు శాంతారావును అభినందించారు. ఈ కార్యక్రమానికి జాషువా సాంస్కృతిక వేదిక నాయకులు గుండు నారాయణ అధ్యక్షత వహించగా జాషువా సాంస్కృతిక వేదిక నాయకులు ఐజాక్ న్యూటన్, చంద్రిక పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సమరం



మాజీ ఎంఎల్ఎ జగన్‌మోహన్‌రావుపై కేసు నమోదు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావుపై కేసు నమోదైంది. తనను గదిలో నిర్బందించి బెదిరించి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం సంబంధించిన వివరణ పత్రం రాయించుకున్నారని నందిగామ మున్సిపల్ కమిషనర్ లోవరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగన్‌మోహన్‌రావుతో పాటు మరో 16 మందిపై 329(1), 131, 132, 126(2), 351(2), 189(2), 190 తదితర సెక్షన్లు కింద కేసు నమోదు చేశారు.

కమిషనర్ ఆరోపణలు అవాస్తవం : మొండితోక

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మున్సిపల్ కమిషనర్ లోవరాజును నిర్బంధించి, దూషించానడం అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము కమిషనర్‌ను నిర్బంధించి దూషిస్తే పక్కనే ఉన్న మిగతా మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి కనపడలేదా అని ప్రశ్నించారు. కమిషనర్ స్థాయిలో ఉండి దిగజారి అక్రమ కేసులు పెట్టడం హేయమైన చర్య అన్నారు. కమిషనర్ తెల్ల కాగితం మీద సంతకం పెట్టేంత అమాయకుడా అని ప్రశ్నించారు. తమపై ఎన్ని అక్రమ కేసులు పెట్టుకున్నా భయపడేది లేదన్నారు. న్యాయపోరాటం చేస్తామని, ప్రజల తరపున నిలబడతామని అన్నారు.

మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా అడుగులేయాలని ఈగల్ అధిపతి, ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. యునైటెడ్ హెూటల్ మేనేజ్మెంట్ కాలేజీ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల స్వాగత కార్యక్రమాన్ని 'సంయుక్త' పేరుతో బుధవారం నిర్వహించారు. గవర్నరుపేట మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐజీ ఆకే రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అటువంటి దుర్వ్యసనాల బారినపడితే జీవితం అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. విజయవాడ డీసీపీ సరిత మాట్లాడుతూ జీవితంలో స్థిరపడి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని, దేశ ప్రగతికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ కె.నగేష్ బాబు, యునైటెడ్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ అబ్దుల్ రజాక్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గెస్ట్ ఫ్యాకల్టీ అబ్దుల్ రెహమాన్, యునైటెడ్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరీమా, ప్రిన్సిపాల్ జగదీష్ జంపన, ఈవెంట్ మేనేజర్ ఉష, ఈగల్ ఇన్స్పెక్టర్ ఎం. రవీంద్ర, ఎస్సై ఎం.వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఐపీఎస్ హోదా పొందిన ఎస్పీ నగేష్‌బాబును యునైటెడ్ కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవయవదానంపై కానూరులోని వీఆర్ సిద్ధార్థ డీమ్‌డ్ టు బీ యూనివర్సిటీలో బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా ఇన్‌చార్జ్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ మాట్లాడారు. మణిపాల్ హాస్పిటల్ విజయవాడ డైరెక్టర్ జె.రామనుజయరెడ్డి మాట్లాడుతూ అవయవ దానం అనేక ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రిజిస్ట్రార్ ఎం.రవిచంద్ర, డా.ఉతమ్ శర్మ, డా.బతీనా రాజేష్, డా.హరిప్రసాద్ పాల్గొన్నారు.



పోటాపోటీగా వాలీబాల్ టోర్నీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవ సంవత్సర కార్యక్రమంగా విజయవాడలోని పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆలిండియా ఇన్విటేషనల్ వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం రాత్రి వర్షం కారణంగా కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించారు. మూడో రోజు వాలీబాల్ మహిళావిభాగం పోటీల్లో స్పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ తమిళనాడు జట్టు అజంప్షన్ కాలేజీ, కేరళ పై, ఎం.సీ.ఎఫ్, ఆంధ్రప్రదేశ్ జట్టు చెన్నై ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీపై, పురుషుల విభాగంలో చెన్నై ఎస్.ఆర్.ఎం. వర్సిటీ టీం, గుజరాత్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాపై, త్రివేండ్రం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా జట్టు కేరళ హెూలీ గ్రేస్ అకాడమీపై విజయం సాధించాయి. ఈ నెల 14 వరకు ఈ టోర్నమెంటు జరుగుతుంది.

72 అడుగుల మట్టి విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: విద్యాధర పురంలోని లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవా సమితి ఏర్పాటు చేయనున్న 72 అడుగుల వినాయక విగ్రహ నమూనా చిత్రపటాన్ని, వినాయక చవితి ఉత్సవాల కరపత్రాన్ని బుధవారం ఎంపి కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. ఈ ఏడాది శ్రీ కార్యసిద్ధి మహాశక్తి గణపతిగా డూండీ వినాయకుడు దర్శనమివ్వనున్నాడు. డూండీ గణేష్ సేవ సమితి కమిటీ సభ్యులతో కలిసి మట్టి వినాయక విగ్రహం నిర్మాణాన్ని పరిశీలించారు. రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షుడు, డూండీ గణేష్ సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డూండీ రాకేష్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి వచ్చే నెల సెప్టెంబర్ 9వ తేదీ ఆదివారం వరకు డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డూండీ గణేష్ సేవ సమితి నిర్వహకులు గడ్డం రవి, ముక్తేశ్వరరావు, పేర్ల రవి, ఆలపాటి సత్యనారాయణ, కె.డి.శ్రీను, దర్శి సుబ్బారావు, నాగేశ్వరరావు, చైతన్య, బాలు, గొల్లపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ పాల్గొన్నారు.

